రసికుడు

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

మునసబు బావమరిదిపెళ్ళికి రాజరత్నాన్ని పిలిపించారు. "వీరయ్య పెళ్ళికి గొప్పబోగంమేళం పెడుతున్నారుట" అని ఊరంతా పాక్కింది. నిలకడమీద అది బోగంమేళం కాదని తెలిసింది. రాజరత్నం బోగందే గాని, ఆ మనిషి గజ్జెకట్టి మేజువాణీలు చేయదనీ, అధ్యాత్మ రామాయణ కీర్తనలు అభినయిస్తూ పాడుతూందనీ తేలింది.

ఈ సంగతి వినగానే బ్రాహ్మణవీధి వాళ్ళకు చాలా కోపాలొచ్చినై. రావూ మరీ? వాళ్ళంతా డొక్కశుద్ధి గలవాళ్లు. "ఏం, బావా? అధ్యాత్మరామాయణం చెప్పించాలంటే ఆ వెల్లటూరాయన్ని పిలిస్తే పొయ్యేదిగా?" అన్నారు ఒకరిద్దరు మునసబుతో.

"అప్పుడు సానిమేళం పెట్టలేదేమని మీరే ఎత్తిపొడుస్తారుగా?" అన్నాడు మునసబు.

"అది సరేగాని, బోగంది అధ్యాత్మరామాయణం పాడటమేమిట్రా?" అని బ్రహ్మచార్లు ఒకరి నొకరు ప్రశ్నించుకున్నారు.

"అది వస్తుంది, ఏదో పాడుతుంది, పోతుంది మధ్య మన కెందుకు?" అని ఒక బ్రహ్మచారి అన్నాడు.

ఆ మాట ఖరారే. ఎందుచేతనంటే ఈ రాజరత్నం అధ్యాత్మరామాయణం పాటలు ఖూనీచేస్తుంటే చూడటానికి బ్రాహ్మణ్యం వెళ్ళకూడదని ఊరంతా ప్రచారమైపోయింది.

మంచినీళ్ళ బావిదగ్గిరకూడా ఈ విషయం వచ్చింది.

"ఏజన్మానో పుణ్యంచేసుకు పుట్టింది. ఈ జన్మలో అధ్యాత్మరామాయణం అబ్బింది!" అన్న దొకావిడ.

"నీ దంతా చోద్యం! ఆ మనిషివస్తే వెళ్ళేవాళ్లంతా అధ్యాత్మం వినబోతా రనుకున్నావా ఏం? మనిషిని చూడబోతారు." అన్న దింకోఆవిడ.

"మనిషి కూడా అందంగా వుంటుందట, పిన్నీ!" అన్నదొక కొత్తగా కాపరానికి వచ్చిన పిల్ల.

"ఎందుకు బాగుండరు, తల్లీ? వాళ్ళకు గంధర్వాంశ!" అన్నదొక నడివయస్సావిడ.

"మన బజార్లో ఎవరూ వెళ్ళరుట!"

"ఎవరు వెళ్ళినా, వెళ్ళకపోయినా సూరయ్యకు తప్పదుగా!

కొత్తగా కాపరానికి వచ్చిన పిల్ల కిలకిల్లాడబోయి, అత్తగారు బావికేసి వస్తూండటం చూసి బిందె ఎత్తుకున్నది. ఆమె బావిదాటి రోడ్డెక్కబోతూ ముందుగా మాలమాదిగ లున్నారేమో అని చూసి, తరవాత చెట్టుకింద గాని, వీధిమొదల గాని సూరయ్య వున్నాడేమో అని చూసింది. ఎందుకంటే సాధారణంగా ఉంటాడు, సూరయ్య తనకేసి చూడనవసరంలేదు. తనకు కనిపిస్తే చాలు ఒళ్ళంతా జల్లుమన్నట్టయ్యేది. ఆ క్షణానికి అది అసహ్యంగా తోచినా తరవాత ఏదో బాగున్నట్టే వుండేది.

సూరయ్య సంగతి ఊళ్లో అందరికీ తెలుసు. ఆయన నలభై చాయలవాడు. బ్రాహ్మణీకం ఏనాడో మంట గలిపాడు. క్రాపింగు పెట్టాడు, బెంగాలీ ధోవతులు వాలుగోచీపెట్టి కట్టేవాడు, స్లిపర్లు తొడిగేవాడు. కోటు వేసుకునేవాడు, సిగరెట్లు కాల్చేవాడు. నెలకు ఇరవైరోజులు బస్తీలవెంట తిరిగేవాడు, ఏడాదికి అధమం ఒకసారైనా పట్నం వెళ్లి వచ్చేవాడు. చిన్నతనంలో తండ్రికి ఎదురు తిరిగి సంస్కృతం మానేసి ఇంగ్లీషు చదువుకు వెళ్ళాడు. కాలేజీలో రెండో ఏడు చదువుతుండగా పెళ్ళాం కాపరానికి వచ్చింది. వెంటనే చదువు మానాడు. మరుసటి ఏడే కూతురు పుట్టింది. తరవాత పిల్లలు లేరు. ఆ కూతు రిప్పుడు పిల్లల తల్లి కూడా అయింది. రెండేళ్ళక్రితం భార్య పోయింది. మళ్ళీ పెళ్ళాడ మన్నారు. కాని, సూరయ్య పెళ్ళాడ లేదు. వెధవ అప్పగారు కాచిపోస్తుంది – గ్రామంలో సూరయ్య ఉన్నప్పుడు.

సూరయ్యది పెద్ద ఆస్తి. డబ్బు మంచినీళ్ళలాగా ఖర్చుచేసి సగంఆస్తి తగలేశాడు. ఆయనకు గ్రామంతో బహు కొద్దిపాటి సంబంధం. అందుచేత గ్రామస్థులు ఆయనను సాధించలేక పోయారు.

రెండేళ్ళక్రితం గాంధీ మహాత్ముడి సహాయ నిరాకరణోద్యమం ఈ గ్రామానికి కూడా వచ్చింది. ఈ ఉద్యమంలో ఆసక్తి పుట్టిన కొద్దిమంది యువకులు

ఇక్కడ కూడా బయలుదేరారు. సూరయ్య వారితోనూ కలిసినవాడు కాలేదు.

ఒక్క విషయం మాత్రం అందరూ ఆమోదించారు. అదేమిటంటే, సూరయ్య రసికుడు. దేశంలో పేరుపడ్డ నాటకాలన్నీ చూశాడు. ఏనాడో బొంబాయి వెళ్ళి బాలీవాలా థియేటర్‌వాళ్ళ నాటకాలు చూశాడు. పాటకచ్చేరీలకు హాజరయేవాడు. "ఏం, సూరయ్యా? ఎప్పుడూ ఇంటిపట్టున ఉండవేం?" అని ఎవరన్నా అడిగితే, "ఈ గ్రామంలో ఏముంది? ఒక నాటకమా, ఒక పాటకచేరీయా?" అనేవాడు. తమకులేని ఆనందం అనేకవిధాలుగా సూరయ్య పొందుతున్నాడని ఊళ్ళో అందరికీ తెలుసు. "అటువంటి ఆనందం లేకపోతేనేం గనక?" అని కొందరు అనుకున్నా, మరికొందరు సూరయ్యను చూసి అసూయపడేవారు.

2

రాజరత్నం వచ్చిందన్నారు. ఆలయం అవతల సత్రంలో దిగిందన్నారు. సూరయ్య వెళ్లి రాజరత్నాన్ని చూసి పలకరించి వచ్చాడన్నారు. బ్రహ్మచార్లకు వెన్నుపూసలు జలదరించాయి. కాని తీరా విచారిస్తే రాజరత్నం పెద్ద అందగత్తె కాదనీ, ఆటే చిన్నదికూడా కాదనీ తెలిసింది. "తెల్లతోలు! అంతకన్నా విశేషం ఏమీలేదు. బక్కపలచని మనిషి!" అన్నారు చూచిన వాళ్లు.

"మరీ అందగత్తె అయితే చూడటం తప్పేమోగాని, సామాన్యం మనిషైతే మనం చూడవచ్చునే!" అన్నాడొక బ్రహ్మచారి – అది వ్యంగ్యమో, అమాయకత్వమో తెలియరాకుండా.

ఏమైనా ఆ సాయంకాలం గుడి మంటపంలో కుర్రకారువాళ్లు చాలామంది చేరారు. వాళ్ళ చూపులు సత్రం వేపే ఉన్నై. ఇదంతా వృథా శ్రమ. ఎందుకంటే దీపాలు పెట్టేవేళ రాజరత్నం ఆలయానికి వచ్చింది. వెంట ఒక ముసలాడున్నాడు. ముసలాడికి ముందుపళ్ళు లేవు.

ఈసారి బ్రహ్మచార్లు రాజరత్నాన్ని బాగానే చూశారు. పాతికేళ్ళ మనిషి. చూడటానికి ఇంచుమించు సంసార స్త్రీలాగే ఉంది.

"భోగందని తెలుస్తూనే ఉంది. ఎంత దాచినా, దాం దుంపతెగా, అది దాగి చావదు!" అన్నాడొక బ్రహ్మచారి. మిగిలినవాళ్లు అవునని ఒప్పుకున్నారు. కాని భోగం మనిషి లక్షణాలు ఆ మనిషిలో ఎక్కడ ఉన్నదీ ఎవరికీ స్పష్టంగా తెలీలేదు.

మెరకవీధివాళ్లుకూడా రాజరత్నాన్ని చూసి పెదవులు విరిచారు. "ఏబ్బే! నిరుడు వెంకమ్మగారి రోశయ్య పెళ్లికి వచ్చిన భోగంవాళ్లముందు ఇది బలాదూర్!" అన్నారొకరు. అంతో ఇంతో ఖర్చు చేయటానికి సిద్ధపడినవాళ్లకు ఆశాభంగం అయినట్టయింది. కొంతమందిమటుకు ఏ నిర్ణయానికీ రాదలచలేదు.

మర్నాడే రాజరత్నం అధ్యాత్మం. మునసబూ, సూరయ్యా, ముందుపళ్లులేని ముసలాడూ కలిసి పెద్ద చర్చచేసి నాలుగురోజుల్లో ఏమేం పాడాలో నిర్ణయించటానికి ప్రయత్నించారు. "అమ్మాయి రెండునెల్లు చెప్పమన్నా చెబుతుంది" అన్నాడు ముసలాడు.

"తన యిష్టం వచ్చినవి, తనకు వచ్చినవి, పాడమను" అన్నాడు సూరయ్య. ఇది మంచి నిర్ణయమేనని మొదటి రోజే రుజువైపోయింది. ఎందుకంటె రాజరత్నం అచ్చగా అధ్యాత్మ రామాయణం పాటలే గాక సందర్భానుసారంగా తరంగాలూ, అష్టపదులూ, కృతులూ, కృష్ణ కర్ణామృతంలో శ్లోకాలూ, భాగవతంలో పద్యాలూ, పారిజాతాపహరణంలో పద్యాలూ ఆఖరుకు వరూధినీ ప్రవరాఖ్యుల ఘట్టంలో పద్యాలూకూడా పాడింది.

రాజరత్నం సరుకున్న మనిషి అనటానికి ఏమీ సందేహంలేదు. "అసలా మనిషికి అధ్యాత్మం నోటపట్టినప్పటిమాటుగద!" అన్నవాళ్లు చాలా పొరపాటు పడ్డారు. ఆ సంగతి తెలుసుకోవటానికైనా వాళ్లు వచ్చి వినలేదు. రుజువుకాని అబద్ధాలు నిజంకన్న బలమైనవి.

రాజరత్నం సరుకు ఏపాటి ఉన్నదో తెలుసుకోగలవాళ్లెవరూ అధ్యాత్మం వినటానికి రానేలేదు. వచ్చినవాళ్లు బొత్తిగా పామరులు. రాజరత్నానికి గల ప్రతిభ కొంచెమే అనుకున్నా, అది బూడిదపోసిన పన్నీరయింది.

పన్నీరంతా బూడిదలోనే పడిందనటం భావ్యం కాదు; కొంత సూరయ్యమీదకూడా పడింది. కాని అందువల్ల సూరయ్యకు కలిగినది ఆనందమని చెప్పటానికి లేదు. ఆయన బాధపడ్డాడు.

నాలుగో రోజు మునసబుగారు సూరయ్య ఎదటే రాజరత్నానికి ఇవ్వటానికి మాట్లాడుకున్నది కాస్తా తాంబూలంలో పెట్టి ఇచ్చేశాడు. ముసలాడూ,

మృదంగం వాయించినవాడూ, రాజరత్నం సత్రానికి తిరిగి వచ్చినప్పుడు సూరయ్యకూడా వెంట వచ్చాడు.

ఏదో ముగిసినట్టూ, దేనికో స్వస్తి చెప్పినట్టూ, ఎవరినో దహనంచేసి వచ్చినట్టూ సూరయ్యకు భావన కలిగింది. చిత్ర మేమిటంటే, ఈ ముగింపు తన జీవితంలో కాక రాజరత్నం జీవితంలో నన్నట్టు సూరయ్యకు తోచింది. ఇకముందు రాజరత్నానికి కష్టాలే తప్ప సుఖ మనేది ఉండదని సూరయ్య గుండె ఆరాట పడుతున్నట్టు కనిపించింది. ఆ భావం ఆయన నోటివెంట విచిత్రమైన ప్రశ్నగా బయటికి వచ్చింది:

"ఇక ఏమిటి ?" అన్నాడాయన రాజరత్నంతో.

ఆమెకు ఆ ప్రశ్నయొక్క అంతరార్థం అర్థమయినట్టులేదు. ఆవిడ నవ్వుతూ, "మేం వచ్చిన పని అయిపోయింది. సెలవిప్పించండి. మీరు చాలా సహాయం చేశారు. మీ ఋణం తీరదు" అన్న దామె నమస్కారం చేస్తూ.

మగవాళ్లు తమ వస్తువులకోసం విసుక్కుంటూ వెతుక్కుంటున్నారు.

"నేను అట్లా అవతలికి వెళ్ళగానే యీ రాజరత్నం కూడా విసుక్కుంటూ తన వస్తువులకోసం వెతుక్కుంటుంది. వాళ్ళమీదా వీళ్ళమీదా ఎగురుతుంది. అధ్యాత్మం లేదు! విద్వత్తూ లేదు!...వేషం విప్పేసుకున్నట్టే" అనుకున్నాడు సూరయ్య.

ఆయనకు భోగంవాళ్లతో పరిచయం ఉంది. వాళ్ల జీవితాలు ఎంత నికృష్టంగా ఉంటాయో ఆయన ఎరుగును. ఈ రాజరత్నంకూడా అట్లా జీవించటం అన్యాయం, ఘోరం! కాని, తాను చేయగలిగింది ఏముంది? ఈతరానివాడు ఒడ్డున ఉండి నీళ్ళలో మునిగిపోతున్న మనిషిని చూసినట్టు సూరయ్య రాజరత్నంకేసి చూడసాగాడు ... ఆ మగవాళ్ళను పంపేసి రాజరత్నాన్ని తన యింటికి తీసుకుపోయి, ఊళ్ళో వాళ్లతో, "ఇదుగో, నేను చేసుకున్న మనిషి!" అని చూపితే ఎంతబాగుండు ననుకున్నాడు.

ఇప్పటికీ సూరయ్య నమ్మకం ఆ బాగు రాజరత్నానికేగాని తనకు కాదని! రాజరత్నాన్ని ఎట్లాగైనా ఉద్ధరించటానికే సూరయ్య మనసు తటతటా కొట్టుకుంటున్నది! ఆమెకు తన ఉద్ధరింపు అవసరం లేదేమోనని ఆయనకు తట్టలేదు.

"కొద్దిరోజుల్లో నేను గుంటూరు రావలసిన పని ఉంది. వీలుంటే అట్లా మీ యింటికేసి వస్తాను. నా దగ్గిర మీ ఎడ్రసుంది!" అన్నాడు సూరయ్య.

"తప్పక రండి!" అన్నది రాజరత్నం.

3

రాజరత్నం వెళ్ళిపోయాక సూరయ్యకు గ్రామం ఎంత కళాహీనంగా కనబడిందో వివరించటం కష్టం. సత్రమూ, గుడీ, మునసబుగారిల్లూ, యింటిముందు పందిరివేసిన చోటూ శాపోదకం చల్లినట్టుగా ఉన్నాయి. ముసలాడి ఫిడేలూ, మృదంగం ముక్తాయింపులూ, రాజరత్నం పాడిన పాటల పల్లవులూ, అభినయమూ తలలో సందడి చేస్తున్నాయి.

సూరయ్య యువకుడు కాడు, ఆడవాళ్ళ మోహం ఎరగనివాడు కాడు. అయినా ఆయన నవయువకుడి తొలి విరహబాధలన్నీ అనుభవించాడు. "దీని బాబుల్లాంటి అందగత్తెల్ని చూశాను ... కాని, దీనిలో ఏదో విలవైనది ఉంది – దాన్ని ఎట్లాగైనా ఉద్ధరించాలి! ఎట్లా ?" అని ఆయన తనను తాను చాలాసార్లు ప్రశ్నించుకున్నాడు.

వారం రోజుల లోపలే అయిదువందలు చేతబట్టుకుని గుంటూరు వెళ్ళాడు. ఉదయం తొమ్మిదిగంటలప్పుడు రాజరత్నం యింటికి వెళ్ళాడు. ముసలాడు వసారాలో కూచుని చుట్టకాలుస్తున్నాడు. దూరంగా ఊసి, "రండి" అన్నాడు, గొంతు సవరించుకుంటూ. తరవాత గొంతెత్తి, "రాజమ్మా ?" అని పిలిచి, జవాబుకోసం ఆగకుండానే, "లోపలికి వెళ్లండి" అన్నాడు.

ఎటువంటి అవతారంలో రాజరత్నం ప్రత్యక్షమవుతుందో అని సూరయ్య భయపడ్డాడుగాని ఆమె మామూలు అవతారంలోనే ప్రత్యక్ష మయింది. తనను చూసి నమస్కారం చేసింది, కూచోవటానికి కుర్చీ చూపింది.

సూరయ్య తాను తెలుసుకోదలచిన విషయాలన్నీ ఒకొక్కక్కటే అడిగాడు. రాజరత్నానికి జరుగుబాటు ఎట్లా అవుతున్నది? ఎవరన్నా పోషకు లున్నారా? అధ్యాత్మరామాయణం చెప్పే అవకాశాలు తరుచు వస్తాయా? ఎవరికన్నా అధ్యాత్మం నేర్పి డబ్బు సంపాదించరాదా? నాటకాలలో వేషాలు వెయ్యటం గురించి రాజరత్నం ఉద్దేశ మేమిటి?

రాజరత్నానికి జరుగుబాటుకు లోటులేదని తెలిసింది. ఆమె సొంత ఇంటో వుంటున్నది. ఇదిగాక ఇంకా రెండిళ్లున్నై. అద్దెలమీద యాభై రూపాయల దాకా వస్తుంది. ముసలాడు ఫిడేలు పాఠాలు నేర్పి సంపాదిస్తాడు. రాజరత్నాన్ని కొంతకాలం ఒక పాటగాడు ఉంచుకున్నాడు. ఆయనే కొంత పాట

అభివృద్ధి చేశాడు. ఆయన వెళ్ళిపోయాక ఆమెకు ఎవరూ లేరు.

"జరిగిపోయిన రోజులే మంచివి. తెలివిగల కుర్రాడు దొరికితే పెంచుకుందామని ఉంది. నేను పెద్దదాన్నయాక నా భారం వాడే మోస్తాడు. అయి తే ళ్ళ కిందటకూడా అందమైన ఆడపిల్లను పెంచు కుందామని ఉండేది – నాలాంటిది కాకుండా!" అన్నది రాజరత్నం.

"మరి ఉద్దేశం మార్చేసుకున్నావేం?" అన్నాడు సూరయ్య.

"ఇంక ఆడపిల్లలు సంపాదించే దేమిటి? మేం తినే దేమిటి? నాకు పెళ్ళి కాకపాయెనే అని కొంతకాలం విచారించా. జరిగిన పెళ్ళిళ్ళు చూస్తే ఆ భ్రమ వది లింది. మీ రేమన్నా చెప్పండి, మా కులంవాళ్లు మడులూ, మాన్యాలూ సంపాదించేరోజులు పోయినై!" అన్నది రాజరత్నం.

"మడులూ మాన్యాలూ సంగతి దేవు డెరుగు. మంచితెలివితేటలుగలపిల్లనుగాచూసి పెంచుకుని దానికి నీవిద్య నేర్పు. నీతో పోనివ్వకు."

రాజరత్నం నవ్వింది.

"ఏం నవ్వుతున్నావు?"

''ఎవడికొక్కావాలండీ ఈ అధ్యాత్మరామాయణం?''

''నాబోటివా డుండడా?''

''నాలుగు డబ్బులు సంపాదించటానికి ఇవేవీ అక్క ర్లేదు. గీత బాగుండాలి. అంతే!...అందానికి నాకు అప్పో చెల్లెలో అవుతుంది—ఇద్దరు జమీందార్లను పట్టింది!''

''నీకూ కూడా జమీందార్లు దొరక్కపోయిరే అని విచారిస్తున్నావా?'' అన్నాడు సూరయ్య ఆశ్చర్యంగా.

''మాటవరసకి చెప్పా!''

''ఒక్క కీర్తన పాడతావా ఏమిటి? నేను మళ్ళా వెళ్ళాలి."

"ఇప్పుడా?"

"ఏం?"

"ఒక్కమనిషి వింటే పాట ఏం రక్తికడుతుంది?"

"మా వూళ్ళో నువు పాడినప్పుడు నే నొక్కణ్ణే వినలేదని నువు నమ్మకంగా చెప్పగలవా?''

''అందరూ విన్నారన్న భ్రమ ఉంటుందిగద?''

''అయినా డబ్బుతీసుకు పాడేదానివి ఊరికే పాడ మంటే పాడతావా? ఇంద!'' అంటూ సూరయ్య జేబులోంచి తీసి డబ్బు ఆమె చేతి కిచ్చాడు.

రాజరత్నం కాస్సేపు నిర్ఘాంతపోయినట్టే కనిపిం చింది. తరవాత డబ్బు తీసుకుని పక్కనే బల్లమీద పెట్టింది. ఆమె తననుగురించి ఘనంగా భావించి ఉంటుందనుకున్నాడు సూరయ్య.

తరవాత రాజరత్నం తంబురా తీసుకుని, "వినవే పల్లవ మృదుచరణా" అన్నపాట పాడింది. పాటలో లోపం ఏమిటో సూరయ్యకు తెలియలేదు గాని, ఆ పాట వాళ్ళ ఊళ్ళో ఉన్నంత రక్తిగా లేదు.

రాజరత్నం పాట ముగించి తంబురా పెట్టేస్తూ, "ఇట్లా పాడితే ఏం బాగుంటుంది?" అన్నది.

"బాగా నేఉంది... ఎప్పుడూ బాగా నే ఉంటుంది" అంటూ సూరయ్య దగ్గిరికి వచ్చి రాజరత్నాన్ని చెంప మీద ముద్దుపెట్టుకున్నాడు.

4

అదిమొదలు సూరయ్య రాజరత్నాన్ని ఉంచు కున్నాడు. మరుసటి ఏడు రాజరత్నానికి ఆడపిల్ల పుట్టింది.

''ఫరవాలేదు. మీ కుతురు నాకన్న చక్కనిదే!'' అన్నది రాజరత్నం సూరయ్యతో.

''దాన్ని వృత్తిలో దింపనని ప్రమాణం చెయ్యి!'' అన్నాడు సూరయ్య.

వయస్సు మళ్లుతున్నకొద్దీ సూరయ్యకు డబ్బుచింత జాస్తి కాసాగింది. 1927 నుంచీ ఆయన నాటకాల కాంట్రాక్టులు ప్రారంభించాడు. లాభం వచ్చినప్పుడు డబ్బు ఏమయిపోయేదో, నష్టంవచ్చినప్పుడు ఆ బొక్క పూడటమంటూ ఉండేదికాదు.

సూరయ్యను అల్లుడు వ్యాపారాలలో దింపాడు. ఇద్దరూచేరి బియ్యంమర అద్దెకు తీసుకున్నారు. నష్టం వచ్చింది. బాకీదార్లకు సూరయ్య ప్రోనోట్లు రాశాడు. ఆయేటికాయేడు సూరయ్య అప్పు పాపం పెరిగినట్టు పెరుగుతున్నది. పొలం తెగనమ్మి తీరుద్దామనుకుంటూనే తాత్సారం చేశాడు.

ఆయన గుంటూరుకేసి నెలల పర్యంతం పోవటం లేదు. రాజరత్నానికి పట్టుమని పదిరూపాయ లిచ్చి ఎంతకాలమయిందో...

ఉప్పు సత్యాగ్రహానికి వాళ్ల ఊరు ఉర్రూత లూగింది. ఒక్కఊపున పధ్నాలుగురు కుర్రాళ్లు జైలుకు సిద్ధపడ్డారు. వారివెంట సూరయ్య పదిహేనువాడుగా తయారయాడు. జైలునుంచి తిరిగి వచ్చాక ఊళ్లో

సూరయ్య పలుకుబడి హెచ్చింది. జైలులో డబ్బున్న వారి స్నేహం లభించింది.

ఆయనకూ రాజరత్నానికీ మధ్య తెగిపోయినట్టయింది. రెండు మూడుసార్లు గుంటూరు వెళ్ళి కూడా రాజరత్నాన్నీ, మాణిక్యాన్నీ చూడకుండానే తిరిగి వచ్చాడు. "ఏదీ ? వ్యవధి లేకపోయింది... ఈసారి!" అని మనస్సును సమాధానపరుచుకున్నాడు.

మరి రెండేళ్ళకు మళ్ళీ రాజకీయ నిస్తబ్దత ఏర్పడింది. జైళ్ళకు పోయిన వాళ్లే జైళ్ళను మరిచిపోయారు. సూరయ్య పని పెట్టుకుని నెలకు ఒకటి రెండుసార్లు రాజరత్నాన్ని చూడసాగాడు. వెళ్లినప్పుడూ పదీ, పరకా మాణిక్యం చేతికే ఇచ్చేవాడు.

ఉన్నట్టుండి ధరలు పడిపోయినై. సూరయ్యకు కంగారు పుట్టింది. ఈ ధరల్లో తన బాకీలు తీర్చటానికి తన ఆస్తి చాలదు! "మళ్లీ ధరలులేవకపోవు! కంగారు అనవసరం!" అనుకున్నాడు.

ఇది అబద్ధంగా పరిణమించింది. "దివాలా అనిపించుకోవటం ఇష్టం లేదు. వచ్చినంత తీసుకుపొండి" అని సూరయ్య అప్పులవాళ్ళకు కబురు చేశాడు.

ఆస్తి పోయాక నాలుగేళ్లపాటు ఆయన రాజరత్నం మొహం చూడలేదు.

తిరిగి **1937** లో కాంగ్రెసు ఎన్నికలకు నిలబడ్డప్పుడు సూరయ్య జీవితంలో చైతన్యం ఏర్పడింది. చేతిలో డబ్బు ఆడింది. సూరయ్యను కాండిడేటుగా నిలబెడదామా అన్న దాక వచ్చింది. కాని అది సాధ్యం కాలేదు. ఎన్నికల అడావుడిలో సూరయ్య చేతిలో బాగా డబ్బు ఆడింది.

"నరసింహారావుతో మాట్లాడి రావాలి. గుంటూరు వెళ్లివస్తావా ఏం ?" అని సూరయ్యను అడిగారు. సూరయ్యకు చప్పున మాణిక్యం మొహం జ్ఞాపకం వచ్చింది. మాణిక్యంమీద మమకారం తన హృదయంలో చాలా రోజులుగా అణుచుకుని ఉంది. గుంటూరు వెళ్లినప్పుడు రాజరత్నం ఇంటికి వెళ్లాడు.

మాణిక్యం పాట నేర్చుకుంటున్నది - అధ్యాత్మ రామాయణం పాట. రాజరత్నం నేర్పుతున్నది. ఎవరో కొత్తవాడు ఫిడేలు వాయిస్తున్నాడు. (ముసలాడు కింద టేడు పోయాడు.)

"ఏమిటి ? పిల్లకు అధ్యాత్మం నేర్పుతున్నావా ?" అని అడిగాడు సూరయ్య.

"అవును, ఏం ?" అన్నది రాజరత్నం.

"ఈ చెత్త ఎందుకు నేర్పుతున్నావు ? ఇది అధ్యాత్మం చెప్పుకు బతుకుతుందనా ?" అన్నాడు సూరయ్య ఆశ్చర్యంగా.

"ఎందుకు బతకరాదూ ? దాని గొంతు నా గొంతుకన్న బాగుంటుంది. సంగీతంకూడా నేర్చుకుంటూనే వుంది. కాస్సేపు వినండి."

సూరయ్య మండిపడ్డాడు. "నేను వినక్కర్లేదు, అది పాడా అక్కర్లేదు! ఈ ఆలోచన కట్టిపెట్టు !"

"ఇది నా ఆలోచన కాదు, మీ ఆలోచనే!" అన్నది రాజరత్నం.

"ఇంకా నయం !—నా కూతురు—"

"నాదే పొరపాటు లెండి" అన్నది రాజరత్నం, సూరయ్యకు అడ్డువస్తూ. "మీరు అధ్యాత్మం నేర్పమన్నది నేను పెంచుకునే పిల్లకుగాని, మీ పిల్లకు కాదు!"

రాజరత్నం ఏమంటున్నదీ అర్థం కానట్టుగా సూరయ్య ఆమెకేసి వింతగా చూశాడు.

"చాకివాఁడు కోక చీకాకుపడఁ జేసి
మయిలఁబుచ్చి మంచి మడుపుఁ జేయు,
బుద్ధి చెప్పువాఁడు గుద్దిన నేమయా ?
విశ్వదాభిరామ వినుర వేమ !"